

www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
శనివారం | 22 | ఆగస్టు | 2026 | పేజీలు: 08


# పెండింగ్ భూసేకరణను వేగవంతం చేయాలి

**భూసేకరణ నిధుల విడుదలకు సీఎం ఆమోదం**

**ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలి**

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలి**

**రైతులు భూ యజమానులతో సమన్వయం చేయాలి**

**కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** రాష్ట్రంలో కొనసాగుతున్న నీటిపారుదల ప్రాజెక్టుల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ..మిగతా 2లో

# పారిశ్రామిక వ్యర్థాలు చెరువుల్లోకి రావొద్దు



**కొల్తూర్ చెరువును సందర్శించిన ఎంపీ ఈటల రాజేందర్**

**కెమికల్ పరిశ్రమలు, డంప్ యార్డు ల వల్ల ప్రజల జీవనం దుర్గంధం అయ్యింది**

**టెక్నాలజీ వచ్చినా రసాయన వ్యర్థాలను అరికట్టలేక పోతున్నాం**

**ఢిల్లీ వరకు వెళ్లి సమస్యను పరిష్కరిస్తా**

**మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్**

**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** కెమికల్ పరిశ్రమలు ఉన్న ఏరియాలు, డంప్ యార్డుల నుంచి వచ్చిన మురుగు నీరు, వాసన వల్ల ఆయా ప్రాంత ప్రజల జీవనం దుర్భరంగా మారిందని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మూడు చింతలపల్లి మున్సిపల్ కొల్తూర్ గ్రామంలో చెరువులో వందలాది చేపలు మృతి చెందడంతో ఈ చెరువును ఎంపీ ఈటల రాజేందర్ సందర్శించారు. చేపల మృతి పట్ల స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి పారిశ్రామిక వ్యర్థాలు చెరువుల్లోకి రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమలు కూడా ట్రీట్మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు చేసుకొని కలుషిత నీళ్ళు ..మిగతా 2లో



# నాంపల్లి గుట్ట సుందరీకరణ

**ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం, ఇతర పనులపై అధికారులకు సూచనలు**





**రాజన్న సిరిసిల్ల, అక్షిత బ్యూరో:** వేములవాడ అర్బన్ మండలం నాంపల్లి గుట్టపై వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ(వీటీఏడీఏ) ఆద్వర్యంలో చేపడుతున్న సుందరీకరణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు. వీటీఏడీఏ ఆద్వర్యంలో నాంపల్లి గుట్టపై ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ఇక్కడికి తరలించారు. విమానం ఏర్పాటు చేసే, ఇతర సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆ పనులను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. విమానం ఏర్పాటు, సుందరీకరణ పనులను గడువులోగా పూర్తి చేసి.. భక్తులు ..మిగతా 2లో

# తాగునీటి సమస్యలు ఉండొద్దు

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి :** నగర ప్రజల ప్రస్తుత, భవిష్యత్తు తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని మహబూబ్‌నగర్‌లో శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం రూ.220 కోట్లతో అదనంగా 18 మిలియన్ లీటర్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం నగరంలో 20 మిలియన్ లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ, పెరుగుతున్న అవసరాలకు అది సరిపోవడం లేదన్నారు. పైప్‌లైన్ లీకేజీలు, పంపింగ్ సామర్థ్యం తగ్గడం, నీటి ..మిగతా 2లో

# ప్రతి పేదింటికి ఇల్లు

**పెంట్లవెల్లి, చిన్నంబావి మండలాల్లో పర్యటన అభివృద్ధి పనులకు శ్రీకారం**

**మంత్రి జూపల్లి కృష్ణారావు**



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పెంట్లవెల్లి, చిన్నంబావి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. పెంట్లవెల్లి ..మిగతా 2లో

www.aakshitha.com People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



## నాంపల్లి గుట్ట సుందరీకరణ

**మొదటి పేజీ తరువాయి...**



పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జిల్లా కలెక్టర్ పూజలు నాంపల్లి గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్ కు స్వాగతం పలికారు. స్వామి వారికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్ కు తీర్థ ప్రసాదాలు అందజేసి.. ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, తహసీల్దార్ జయంత్ కుమార్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## పారిశ్రామిక వ్యర్థాలు చెరువుల్లోకి రావొద్దు



**మొదటి పేజీ తరువాయి...**

బయటికి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారి మీద ఉందని, లేదంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి ఉంటుందని ఈటల హెచ్చరించారు. ఇంత టెక్నాలజీ వచ్చినా, నిబంధనలు వచ్చినా రసాయన వ్యర్థాలను అరికట్టలేక పోతున్నారన్నారు. ప్రతి పరిశ్రమలో ట్రీట్మెంట్ ప్లాంట్ పెట్టాలి కానీ కొద్దిమంది ఫార్మా కంపెనీల యాజమాన్యాలు బోర్లు వేసి ఆ రసాయన వ్యర్థాలను భూమిలోకి పంపిస్తున్నారని, డ్రైనేజీ లలో వదిలి పెడుతున్నారని అన్నారు. దీనివల్ల చెరువుల్లో ఉన్న చేపలు, వాటిని తిన్న కొంగలు, పక్షులు చనిపోతున్నాయి. నీళ్లు తాగి పశువులు చనిపోతున్నాయన్నారు. కొల్తూర్ గ్రామంలో జీనోమ్ వ్యాలీ నుండి వచ్చిన రసాయన వ్యర్థాల వల్ల దాదాపు 15 లక్షల విలువైన చేప పిల్లలు చనిపోయాయని, ఈ చేపలు పెరిగితే కోటి రూపాయల సంపద వచ్చేదన్నారు. ఈ చేపల మీద ఆధారపడి ఉంటున్న 250 కుటుంబాలు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మాకంపెనీల వల్ల ఉపాధి దొరుకుతుంది. అనుకుంటే, వాటి వల్ల ప్రజల ప్రాణాలే పోతున్నాయని గ్రామస్థులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రాంత సమస్యపై అవసరం అయితే డిల్లీ వరకు వెళ్లి ఫిర్యాదు చేస్తానని హామీ ఇచ్చారు. దీనికి శాశ్వత పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు.

## ప్రతి పేదింటికి ఇల్లు

**మొదటి పేజీ తరువాయి...**



మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న ఇళ్ల స్థితిగతులను మంత్రి స్వయంగా పరిశీలించి అర్హులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యం. గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. గోడలు నిర్మించుకుని స్లాబ్ దశలో ఉన్న అర్హులకు రూ.2 లక్షలు, బేస్ లెవెల్ పూర్తి చేసుకుని ఆర్థిక ఇబ్బందులతో ఆగిపోయిన వారికి రూ.4 లక్షల పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తున్నాం. పారదర్శకంగా ఎంపిక చేపడుతున్నాం అని తెలిపారు. చిన్నంబావి అభివృద్ధికి రూ.4 కోట్లు – చిన్న మారూర్ ఎత్తిపోతల ద్వారా నీటి విడుదల అనంతరం చిన్నంబావి మండలంలో పర్యటించిన మంత్రి చిన్న మారూర్ ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేశారు. దీంతో రైతులకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని, రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, రుచి, నాణ్యత ఎలా ఉందని విద్యార్థుల ను నేరుగా అడిగి తెలుసుకున్నారు. వంటశాల, భోజనశాలను పరిశీలించి విద్యార్థులకు అందించే భోజనం విషయంలో నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదు అని అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వసతి సౌకర్యాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని, బాలికలకు సురక్షిత వాతావరణంలో నాణ్యమైన విద్య అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలు ఉండొద్దు

**మొదటి పేజీ తరువాయి...**

సరఫరాలో అంతరాయాలు వంటి కారణాలతో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడుతోందని చెప్పారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అదనంగా 18 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు, ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్లను నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వ భూముల్లో ట్యాంకుల నిర్మాణం చేపట్టాల్సి ఉండటంతో అక్కడక్కడా ఎదురవుతున్న భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే 8 లకు శంకుస్థాపన చేయగా, నేడు మౌలాలిగుట్ట(500 కిలో లీటర్ల సామర్థ్యం , 328.72 లక్షలు) మెట్టుగడ్డ(1200 కిలో లీటర్ల సామర్థ్యం, 261.02 లక్షలు) టీచర్స్ కాలనీ (2000 కిలో లీటర్ల సామర్థ్యం, 391.46 లక్షలు) ప్రాంతాల్లో మరో మూడు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. మిగిలిన ట్యాంకుల నిర్మాణ పనులను కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. అన్ని ట్యాంకుల నిర్మాణం పూర్తయిన తర్వాత నగరంలో నీటి నిల్వ సామర్థ్యానికి సంబంధించిన సమస్య ఉండదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పంపింగ్‌లో ఒకరోజు ఆలస్యం జరిగినా ముందుగానే నీటిని నిల్వ చేసుకుని ప్రజలకు సరఫరా చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా మారిన





నేపథ్యంలో నగర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకువస్తున్నామని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా రూ.600 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయించుకున్నామని, రాబోయే వారం, పది రోజుల్లో ఒక్కో కాలనీ, ఒక్కో డివిజన్‌లో దశలవారీగా పనులకు శంకుస్థాపనలు ప్రారంభిస్తామని చెప్పారు. రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. డ్రైనేజీ పనుల సమయంలో రోడ్ల తవ్వకాలు, కొన్ని మార్గాలను తాత్కాలికంగా మూసివేయడం వంటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, నగర ప్రజలు అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. మహబూబ్‌నగర్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేవలం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.600 కోట్ల నిధులను తీసుకువచ్చామని తెలిపారు. ఈ నిధుల మంజూరులో ముఖ్యమంత్రి పూర్తి సహకారం అందించారని పేర్కొన్నారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు మహబూబ్‌నగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు పెద్ద గొల్ల నర్సింహులు, తాహెర్, వాణిశ్రీ ప్రశాంత్, రమేష్ రెడ్డి , విట్టల్ రెడ్డి, ఫక్రు, షబ్బీర్ అహ్మద్, సల్మాన్, తిరుమల వెంకటేష్, మేగ్యా నాయక్,అవేజ్, నాయకులు మైత్రి యాదయ్య, రమేష్ యాదవ్, వాల్దాస్ ప్రతాప్ గౌడ్ వర్ధ రవి, అశ్వాక్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ భూసేకరణను వేగవంతం చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**




భూసేకరణ, భూ యజమానులకు పరిహారం చెల్లింపు, పునరావాసం, అటవీ సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ, నీటిపారుదలశాఖల అధికారులను ఆదేశించారు.నీటిపారుదల ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ,పునరావాసం--పునరావాస పునరుద్ధరణ పరిహారం చెల్లింపులు, అటవీ అనుమతులు తదితర అంశాలపై రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఇ.శ్రీధర్ తో కలిసి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత చీఫ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర సమీక్ష నిర్వహించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా ఐడీఓసీ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చెన్నయ్య, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ విజయ్ భాస్కర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.... నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణ పనులు వేగంగా కొనసాగాలంటే భూసేకరణ ప్రక్రియ పూర్తవడం అత్యంత ముఖ్యమన్నారు. భూసేకరణ కోసం అవసరమైన నిధులను సమకూర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.పెండింగ్ భూసేకరణను వేగవంతం చేసేందుకు నిధులను విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారని మంత్రి వెల్లడించారు. అవసరమైన నిధులు అందుబాటులోకి వస్తున్నందున అధికారులు భూసేకరణ ప్రక్రియను ఇకపై మరింత వేగవంతం చేయాలని సూచించారు.

నిధుల కొరత కారణంగా ఏ ప్రాజెక్టులోనూ భూసేకరణ, పరిహారం చెల్లింపు ప్రక్రియలు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిధులు విడుదలైన వెంటనే వాటిని నిర్దేశిత ప్రయోజనాలకు వినియోగించి అర్హులైన భూ యజమానులు, నిర్వాసిత కుటుంబాలకు చెల్లింపులు చేపట్టాలని సూచించారు.

కొత్త ఆయకట్టు అభివృద్ధి చేయడంతో పాటు ఇప్పటికే ఉన్న ప్రాజెక్టుల ద్వారా రైతులకు సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుల పనులు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉన్నందున, భూసేకరణ వంటి ప్రక్రియలు ప్రాజెక్టుల నిర్మాణానికి అడ్డంకిగా మారకుండా చూడాలని స్పష్టం చేశారు.

ప్రతి జిల్లాలో ప్రాజెక్టుల వారీగా పెండింగ్ భూసేకరణ కేసులను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. భూసేకరణ అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు, అటవీ శాఖకు సంబంధించిన అనుమతులు తదితర అంశాలను సమన్వయంతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్లు, సంబంధిత చీఫ్ ఇంజినీర్లు తమ పరిధిలోని ప్రతి నీటిపారుదల ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ప్రాజెక్టు వారీగా, జిల్లా వారీగా సిద్ధంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు.

ఆర్థిక శాఖ నుంచి విడుదలైన నిధులు, జిల్లా కలెక్టర్ పీడీ ఖాతాలో జమ అయిన మొత్తం, ప్రస్తుతం పీడీ ఖాతాలో ఉన్న నిధులు, చెల్లింపుల కోసం విడుదల చేసిన మొత్తం, ఇప్పటివరకు భూ యజమానులు, భూములు కోల్పోయిన రైతులు, నిర్వాసిత కుటుంబాలు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు చెల్లించిన పరిహారం తదితర వివరాలను సమగ్రంగా పర్యవేక్షించాలని తెలిపారు.

ఇంకా చెల్లించాల్సిన పరిహారం ఎంత ఉంది, ఎంతమంది లబ్ధిదారులకు చెల్లింపులు జరగాల్సి ఉంది. చెల్లింపుల్లో జాప్యానికి కారణాలేమిటి, ఏ అంశాలు ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాల్సి ఉంది అనే వివరాలను స్పష్టంగా గుర్తించాలని మంత్రి ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ నాగర్‌కర్నూల్ నాగర్ కర్నూల్ జిల్లాలోని కొనసాగుతున్న పాలమూరు రంగారెడ్డి, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ , అచ్చంపేట ఎత్తిపోతల పథకం ఇతర సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు.

భూసేకరణకు సంబంధించిన ప్రతి కేసును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూ యజమానులు, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, నిబంధనల ప్రకారం పరిష్కరించగల అంశాలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

పెండింగ్ భూసేకరణ కేసులు, పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు, అటవీ సంబంధిత అంశాలపై పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత కాలవ్యవధిలో సమస్యలను పరిష్కరించేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నీటిపారుదల శాఖల అధికారులు, రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అటవీ సంపద ధ్వంసం

### పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు
### సమాచార హక్కు చట్టానికి
### మణుగూరు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ తూట్లు!




భద్రాద్రి కొత్తగూడెం / అక్షిత బ్యూరో: మణుగూరు మండల పరిధిలోని చిన్నారావి గూడెం నుండి గుట్ట మల్లారం వరకు ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఇసుక ర్యాంపుల కోసం భారీ యంత్రాలతో వందలాది చెట్లను నరికివేసి, నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మించడం ప్రత్యక్షంగా జరిగిన వాస్తవం. ఆధారాలతో సహా బహిర్గతమైన ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు, అటవీ సంపదను కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులకు సహకరిస్తూ సమాచార హక్కు చట్టాన్ని నీరుగారుస్తున్నారు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా అధికారుల తీరులో ఎలాంటి మార్పు లేదు. చెప్పిన విషయాన్నే మళ్ళీ మళ్ళీ చెబుతూ అవినీతిని కప్పి పుచ్చుకునేందుకు శత విధాలా ప్రయత్నిస్తున్నారు.

**మీడియా కథనాలతో బయటపడ్డ ఫారెస్ట్ అధికారుల అవినీతి అక్రమాలు**

మణుగూరు అటవీ ప్రాంతంలో ఇసుక ర్యాంపుల వ్యాపారులకు, కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తూ ఫారెస్ట్ అధికారులు ఏ విధంగా అవినీతికి ఒడిగట్టారో ఇప్పటికే పలు మీడియా కథనాలు స్పష్టం చేశాయి. పర్యావరణాన్ని, వనరులను రక్షించాల్సిన అధికారులే తమ స్వార్థం కోసం వందలాది చెట్లను నరికివేసి, కిలోమీటర్ల మేర అక్రమంగా రోడ్డు నిర్మించడాన్ని ఆధారాలతో సహా ఎండగట్టడం జరిగింది. ఒక పక్క నిరుపేదలు అడవిలో ఒక్క చిన్న చెట్టు కొమ్మ నరికినా కేసులు నమోదు చేసే ఫారెస్ట్ యంత్రాంగం, రూ. లక్షల విలువైన అటవీ సంపదను ధ్వంసం చేస్తూ, భారీ యంత్రాలతో దారి ఏర్పాటు చేస్తుంటే మౌనం వహించడం వెనుక ఎంతటి పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందో అర్థమవుతోంది. కలెక్టర్ ఆదేశాల పేరు చెప్పి, ఎలాంటి పర్యావరణ క్లియరెన్సులు, ఎన్వోటీ అనుమతులు లేకుండానే అక్రమార్కులకు రహదారిని నిర్మించి ఇవ్వడం అధికారుల అవినీతి దాహానికి నిదర్శనంగా నిలిచింది.

**ఆర్టీఐ దరఖాస్తుపై అధికారుల దాటువేత ధోరణి**

ఈ అటవీ విధ్వంసంపై పారదర్శకత కోరుతూ సామాజిక కార్యకర్త, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ స్టేట్ కో-ఆర్డినేటర్ గంగాధర కిశోర్ కుమార్ సమాచార హక్కు చట్టం సెక్షన్ కింద 12 కీలక అంశాలపై సమాచారం అడిగారు. చెట్ల నరికివేత, ఎన్వోటీ, పీసీబీ అనుమతులు, యంత్రాల వివరాలు కోరగా, అధికారులు "సమాచారం నా పరిధిలో లేదు", అని బాధ్యతా రాహిత్యంగా సమాధానమిచ్చారు.

**రికార్డుల తనిఖీకి నిరాకరణ -- సమాచార హక్కు చట్ట ఉల్లంఘన:**

సమాచార హక్కు చట్టం సెక్షన్ 2(జె) ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లోని రికార్డులను, పనులను నేరుగా తనిఖీ చేసే హక్కు పౌరులకు ఉంటుంది. అయితే, మణుగూరు ఫారెస్ట్ అధికారులు ఈ రికార్డుల తనిఖీని కూడా బహిరంగంగా నిరాకరించడం ద్వారా చట్ట నిబంధనలను ధిక్కరించి, తమ అక్రమాలను దాచుకునే ప్రయత్నం చేస్తున్నారు. మొదటి అప్పీలు చేసినా ఎలాంటి స్పందన లేదు..

**అధికారులపై సెక్షన్ 20(1), 20(2) కింద కఠిన చర్యలకు డిమాండ్**

ప్రజా ప్రయోజనాలతో కూడిన సమాచారాన్ని దాచిపెట్టడం, తప్పుదోవ పట్టించే కాపీలు ఇవ్వడం తీవ్రమైన నేరం. సమాచార హక్కు చట్టం సెక్షన్ 20(1) మరియు 20(2) ప్రకారం ఉద్దేశపూర్వకంగా సమాచారాన్ని నిరాకరించిన, చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులపై రోజువారీ జరిమానా విధించడంతో పాటు డిపార్ట్మెంటల్ క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేస్తుంది.

**అవినీతిపై సమగ్ర విచారణకు డిమాండ్**

కేవలం సమాచార హక్కు చట్టాన్ని ధిక్కరించడమే కాకుండా, ప్రభుత్వ బాధ్యతాయుతమైన పదవుల్లో ఉంటూ అటవీ సంపదను కాపాడాల్సిన అధికారులు తమ అధికార పరిధిని దుర్వినియోగం చేయడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ముందస్తు పర్యావరణ అనుమతులు లేకుండా, కేంద్ర అటవీ సంరక్షణ చట్టం మరియు పర్యావరణ పరిరక్షణ చట్టం నిబంధనలను ఉల్లంఘించి యంత్రాలతో చెట్లను నరికివేయడం చట్టరీత్యా నేరం. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు, కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేలా అధికారులు వ్యవహరించడం వెనుక ఉన్న అవినీతి కోణాన్ని వెలికితీసేందుకు అవినీతి నిరోధక శాఖ మరియు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల చేత సమగ్ర విచారణ జరిపించాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి. రాజ్యాంగబద్ధమైన సమాచార హక్కును తిరస్కరిస్తూ, రికార్డులను దాచడం ద్వారా అధికారులే స్వయంగా తమ అక్రమాలను ఒప్పుకున్నట్లవుతోందని, బాధ్యులైన అధికారులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.




# విద్యారంగానికి సేవలందిస్తున్న...
### ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు రక్షణ కల్పించాలి
### ఇచ్చోడలో ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్
### ప్రిన్సిపాల్ రూపారెడ్డి మృతికి నిరసన ర్యాలీ




ఇచ్చోడ అక్షిత న్యూస్: విద్యారంగానికి ఎనలేని సేవ లు అందిస్తున్న ఉపాధ్యాయులు, ప్రిన్సిపళ్లకు రక్షణ కల్పించాలనీ ఇచ్చోడ మండల ప్రైవేట్ పాఠశాల యాజమాన్యుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. విద్యార్థుల చేతుల్లో దారుణ హత్యకు గురైన ప్రిన్సిపాల్ రూపా రెడ్డికి న్యాయం చేయాలంటూ శుక్ర వారం అదిలా బాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠ శాల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యం లో నిరసన ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలను స్వచ్ఛందంగా మూసి వేశారు. స్థాని క అంబేద్కర్ విగ్రహానికి, స్థానిక తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ పటాన్ కువారు వినతి పత్రాన్ని అందజేశా రు. రూపారెడ్డి మృతి పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ మృతి కి దారితీ సిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆమె కుటుం బానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, నిందితులను కఠినంగా శిక్షించా లని వారు స్పష్టం చేశారు.

# ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య విద్యా వ్యవస్థకే మాయని మచ్చ
### హంతకులను కఠినంగా శిక్షించాలి..
### రామన్నపేట ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల డిమాండ్



రామన్నపేట అక్షిత ప్రతినిధి: కొండమల్లేపల్లి నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్య విద్యా వ్యవస్థకే మాయని మచ్చ అని రామన్నపేట మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. రూపారెడ్డి హత్యను నిరసిస్తూ శుక్రవారం రామన్నపేట మండల వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల బంద్ నిర్వహించారు. పలు పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం నుంచి సుభాష్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం సుభాష్ సెంటర్లో ఏర్పాటు చేసిన రూపారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు కరెస్పాండెంట్లు మాట్లాడుతూ.. నేటి విద్యా వ్యవస్థలో కొంతమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ప్రవర్తన తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. సమాజ నిర్మాణంలో గురుతర బాధ్యత నిర్వహించే ఉపాధ్యాయులు, విద్యా సంస్థల నిర్వాహకులకు రక్షణ లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులపై దాడులు, బెదిరింపులకు అడ్డుకట్ట వేయకపోతే విద్యా వ్యవస్థ మనుగడకే పెను ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రూపారెడ్డి హత్యకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించి, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరెస్పాండెంట్లు టి. మల్లికార్జున్, జె. మార్టిన్, జి. నరేందర్‌రెడ్డి, కనకాచారి, నాగరాజు, శ్రీధర్ తదితరులతో పాటు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో
# సామూహిక వరలక్ష్మి వ్రతం



చౌటుప్పల్ / అక్షిత న్యూస్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళా భక్తులచే సామూహిక వరలక్ష్మి వ్రతం వేద పండితులు పెద్ది సుధాకర్ శర్మ చే వేద మంత్రోచ్ఛరణలతో అమ్మవారి వ్రత కార్యక్రమం నిర్వహించారు.

చౌటుప్పల్ పురపాలక మహిళా భక్తులు తమ యొక్క సౌభాగ్యం నిండు నూరేళ్లు ఉండాలని అమ్మవారిని కోరుకుంటూ సామూహిక వరలక్ష్మి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్,దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, ధర్మకర్తలు వరకాల రవి గౌడ్, ఆవుల యేసు యాదవ్, గగులోతు అరుణ శంకర్ నాయక్, దాడి యశ్వంత్ రెడ్డి, ట్రినిటీ విద్యాలయాల ప్రిన్సిపల్ ఉజ్జిని మంజుల , పెద్ది స్వాతి కిషోర్ శర్మ, ఉప్పల కుసుమ, చింతల విజయలక్ష్మి, చింతల కరుణ, ఉప్పల దీపిక, పల్సర్ శ్రావణి,జక్కర్తి స్వాతి, దేవరపల్లి కరుణశ్రీ, దాచేపల్లి లక్ష్మి, దాచేపల్లి రమాదేవి, సింగరికొండ శైలజ, గర్దాసు లక్ష్మి, పారా అనసూయ, మిరియాల లక్ష్మీ ప్రియ, మొగుదాల వెంకటేష్ గౌడ్, బొడ్డు రాజేందర్ రెడ్డి, కాసాని అయిలమ్మ, మునుకుంట్ల జయమ్మ, బడుగు గౌరీశ్వరి, బొబ్బిళ్ళ యశోద, చింతకింది ప్రవలిక, సుర్వి జంగమ్మ, రేగలగడ్డ శిరీష, సుర్వి నికిత, బాలగోని ప్రగతి, తదితర మహిళా భక్తులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



# రైతులకు ద్రోహం చేస్తున్న రేవంత్ సర్కార్

**దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

**పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపు ఆపాలి**

**కాళేశ్వరాన్ని ఎండబెట్టింది చంద్రబాబు కోసమే**

**స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యంపై విమర్శలు**

**చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్**

**ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం**




**పెద్ద అడిశర్లపల్లి, అక్షిత ప్రతినిధి:** నీళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తోందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు. శు క్రవారంహొపెద్ద అడిశర్లపల్లి మండలం గణపురం స్టేజ్ వద్ద ఏఎంఆర్‌పీ మెయిన్ కెనాల్ డిస్ట్రిబ్యూటర్




మెయిన్ గేట్ల వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాగార్జున సాగర్‌కు చుక్క నీరు కూడా రాకుండా పోతిరెడ్డిపాడు ద్వారా 25 వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారని, సాగర్ నిండేంత వరకు ఆ తరలింపును ఆపాలని డిమాండ్ చేశారు. ఎగువ నుంచి కృష్ణా నదికి సమృద్ధిగా నీరు వస్తున్నా రైతులకు సాగునీరు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, చంద్రబాబు నాయుడు ప్రయోజనాల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును రేవంత్ రెడ్డి ఎండబెట్టారని, తెలంగాణ ప్రయోజనాల కంటే ఇతర రాష్ట్రాల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. నల్లగొండకు నీటిని తరలిస్తున్నా స్థానిక ఎమ్మెల్యేకు రైతుల గురించి పట్టింపు లేదని, నల్లగొండ ఉన్న ప్రేమ రైతులపై లేదని అన్నారు. కేసీఆర్ హయంలో నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద రైతులకు సమృద్ధిగా నీరు ఇచ్చామని, ప్రస్తుత ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రెండు పంటలకు నీరు ఇవ్వొచ్చునని తెలిపారు. ఏఎంఆర్‌పీ నీటితో ముందుగా గుడిపల్లి, పెద్ద అడిశర్లపల్లి మండలాల్లోని చెరువులు, కుంటలు నింపాలని, భూగర్భ జలాలు పడిపోతున్నందున తాగునీటి సమస్య రాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోకపోతే మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, మండల అధ్యక్షులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు,హొ పలువురు సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరపాగ భాస్కర్ కు ఘన నివాళులు అర్పించిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలం, వెన్నచర్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ 3వ వార్డు మెంబర్ దేవరపాగ భాస్కర్ గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం 4 గంటలకు తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న పెద్దకొత్తపల్లి మండలం మాజీ ఎంపీపీ శ్రీ సూర్య ప్రతాప్ గౌడ్ భాస్కర్ స్వగృహానికి చేరుకొని వారి భౌతికకాయంపై పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ మాట్లాడుతూ దేవరపాగ భాస్కర్ ని కోల్పోవడం చాలా బాధాకరం. వారితో ఉన్న స్నేహం, వారి మాటకు ఉన్న విలువ, నిస్వార్థత కలిగిన నాయకునిగా వారు అందరికీ గుర్తుండిపోతారు. వారిని కోల్పోవడం ఎంతో దురదృష్టకరం. కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఎలాంటి అవకాశాలు ఉన్నా సహకారం అందించడానికి మేము ఎల్లప్పుడూ ముందుంటాం అని భరోసా ఇచ్చారు. వారితో పాటు గ్రామ ఉప సర్పంచ్ బై రాముడు, మాజీ ఎంపీటీసీ డి.రవికుమార్, గ్రామ నాయకులు వి.బాలింగచారి, వార్డు మెంబర్ మద్దని పద్మ, జంగం నాగరాజు, టీచర్ ప్రభాకర్, సంగమల తిరుపతయ్య తదితరులు పాల్గొని పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

## అకస్మాత్తుగా మృతి చెందిన కుటుంబానికి అండగా బిఆర్ఎస్ నాయకుల ఆర్థిక సాయం



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన 10వ వార్డు నివాసి నీరటి చంద్రమౌళి అకస్మాత్తుగా చనిపోవడం జరిగింది,విషయం తెలుసుకున్న సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు అందరు కలిసి 5000/- వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వట్టేపు బాలయ్య,మాజీ సర్పంచ్ సునీత వెంకట్ రెడ్డి,మాజీ ఎంపిటిసి కడల సంతోష మల్లేష్,ఉప సర్పంచ్ నిజాముద్దీన్,విజయ్ డైరీ అధ్యక్షుడు కంకల శ్రీశైలం,వార్డు సభ్యులు వట్టేపు కిషోర్,రజిత మల్లేష్,బిజినపల్లి స్వాతి బాలరాజు, మేకల బాలరాజు,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తాండ్ర తిరుపతయ్య గౌడుగు శేఖర్,కాసిరెడ్డి రాంరెడ్డి,యాదగిరి రెడ్డి,గిరి,ఐలయ్య, పురుషోత్తం,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సిమెంట్ బ్లాక్‌లు ఏర్పాటు

**ఏసీపీ ట్రాఫిక్, టీ .సత్యనారాయణ**

**ట్రాఫిక్ సి ఐ పీ.వెంకన్న**




**కాజిపేట్ అక్షిత ప్రతినిధి :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ నందు ట్రాఫిక్ రోజు రోజుకు పెరిగిపోతున్నదున వాహనదారు లకు ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పోలీసులు ఓయసిస్ ఫర్టిలిటీ హాస్పిటల్ వారి సహకారంతో సిమెంట్ బ్లాక్ లు ఏర్పాటు చేశారు. వరంగల్ పోలీసు కమిషనర్ శ్వేతా అదేశాల మేరకు , అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ , ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ పర్యవేక్షణలో కాజిపేట్ ట్రాఫిక్ సీఐ పీ.వెంకన్న వారి సిబ్బంది తో శుక్రవారం కాజిపేట్ ట్రాఫిక్ పరిధి లోని ఆదాలత్ జంక్షన్ నందు మూడు వైపుల,ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్ నందు ఒక్క వైపు మొత్తాం 54 సిమెంట్ బ్లాక్ ఫ్రీ లెఫ్ట్ లో అమర్చినారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువా ఉన్నందున ఫ్రీ లెఫ్ట్ ఏర్పర్చుడం వలన వాహనదారులకు ఇబ్బందీ లేకుండా ట్రాఫిక్ అంతరాయం కాకుండా ప్రయాణించడానికి అనుకూలంగా ఏర్పాటు చేశారని సీఐ ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా సిమెంటు బ్లాకులను ఏర్పాటు చేసిన పోలీసులకు వాహనదారులు అభినందనలు తెలిపారు.

## అక్టోబర్ 6న జరిగే విద్యార్థుల జాతీయ మహాసభ విజయవంతం చేయండి

**సందే కార్తీక్ మాదిగ ఆహ్వానం**




**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ఎంఎస్ఎఫ్ కమిటీ స్థాపన మాదిగ విద్యార్థుల హక్కుల సాధన, సామాజిక న్యాయం మరియు సమానత్వ రాజ్యస్థాపన కొరకు విద్యార్థుల ఉద్దీపన ముగ్ధం చేస్తూ మొక్కుబడి తీసుకుంటున్నారు, సంధే కార్తీక్ మాదిగ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్సీ రిజర్వేషన్ల ఏబీసీడీ వర్గీకరణ సాధించబడిన నేపథ్యంలో వర్గీకరణ ఫలాలను అందుకోవడంలో మాదిగ విద్యార్థులు ముందువరుసలో ఉండాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సంధే కార్తీక్ మాదిగ మాట్లాడుతూ,భారతదేశంలో ఆర్థిక,రాజకీయ, సామాజిక మరియు లింగ సమానత్వం సాధించాలంటే విద్యార్థి ప్రపంచం ముందుకెళ్లాలి. మహనీయులు కలలు కన్న సమానత్వ రాజ్యాన్ని స్థాపించడానికి ప్రతి విద్యార్థి నడుము బిగించి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.అక్టోబర్ 6న ఉస్మానియా యూనివర్సిటీలో జరగనున్న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను విజయవంతం చేయాలనే సంకల్పంతో ప్రతి కళాశాల, గ్రామం, మండలం,నియోజకవర్గం,జిల్లా

మరియు యూనివర్సిటీ స్థాయిలో ఎంఎస్ఎఫ్ కమిటీల నిర్మాణం చేపట్టామని సంధే కార్తీక్ తెలిపారు. ఈ క్రమంలో నేడు కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలో ఎంఎస్ఎఫ్ కమిటీని అధికారికంగా స్థాపించారు.కల్వకుర్తి కళాశాల కమిటీ సమావేశంలో విద్యార్థుల సమస్యలు,హక్కులు మరియు సామాజిక న్యాయ సాధనపై చురుకైన కార్యక్రమాలు పర్యవేక్షించాలనే నిర్ణయం తీసుకున్నారు. సమస్యల రేకుమాపు, అవగాహన శిబిరాలు, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో కమిటీ ప్రభావిత సన్నాహక కార్యక్రమాలు నిర్వహించేలా కార్యాచరణ పథకాలు రూపొందించడం జరిగింది. అనంతరం కళాశాల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమానికి ఎంఎస్ఎఫ్ జిల్లా కో ఇంచార్జి బుక్కాపురం మహేష్ అధ్యక్షత వహించారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా నేతలు దేవరాజు మాదిగ, పరుశు రాము మాదిగ, వీరపాగ శివకుమార్ మాదిగ, శ్రీకృష్ణ మాదిగ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పార్థివ వాహన సేవలకు నిధుల కొరత




**వనపర్తి అక్షిత ప్రతినిధి :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పేద, నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న పార్థివ వాహన సేవలు నిధుల కొరత కారణంగా ఎప్పుడైనా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందనే ఆందోళన వ్యక్తమవుతోంది. జీవీకే ఈఎంఆర్ఐ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పార్థివ వాహనాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మృతి చెందిన పేదలు, నిరుపేద కుటుంబాలకు చెందిన వారి పార్థివ దేహాలను ఉచితంగా వారి స్వగ్రామాలకు తరలిస్తున్నాయి. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో అందుబాటులో ఉండే ఈ వాహనాల ద్వారా ప్రతిరోజూ సుమారు రెండు పార్థివ దేహాలను వారి స్వగ్రామాలకు తరలిస్తూ ప్రజలకు విలువైన సేవలు అందిస్తున్నారు. అయితే గత సుమారు రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో పార్థివ వాహనాల నిర్వహణతో పాటు సేవల నిరంతర కొనసాగింపుపై తీవ్ర ప్రభావం పడుతున్నట్లు తెలుస్తోంది. నిధుల కొరత కారణంగా వాహనాల నిర్వహణ కష్టతరంగా మారడంతో సేవలు ఎప్పుడు నిలిచిపోతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆప్తులను కోల్పోయిన పేద కుటుంబాలు విషాద సమయంలో పార్థివ దేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తే భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వ పార్థివ వాహన సేవలు వారికి ఎంతో అండగా నిలుస్తున్నాయి.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి**

పేద, నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ సేవలు నిలిచిపోకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి పార్థివ వాహనాల నిర్వహణకు అవసరమైన నిధులను సకాలంలో విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు. వాహనాల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించి, పార్థివ వాహన సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

# అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో నమోదు చేయాలి

**ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలి**

**క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. ఓటరు జాబితా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావు లేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

శుక్రవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండలంలోని 197, 201 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2002 నాటి ఓటరు జాబితాను ప్రస్తుత ఓటరు జాబితాతో అనుసంధానం చేసే క్రమంలో గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్న ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు.

197వ పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటరు ఎం.డి. అక్బర్‌కు నోటీసు జారీ చేస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. 2002 నాటి ఓటరు జాబితాలో నమోదైన పేరుకు, ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలో నమోదైన పేరుకు సరిపోలిక లేకపోవడంతో సంబంధిత ఓటరును అనామలీస్ జాబితాలో గుర్తించి నోటీసు జారీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

నోటీసుల జారీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఓటరుకు సరైన సమాచారం అందేలా, సంబంధిత వ్యక్తికి నోటీసు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటరు తన అర్హతను నిరూపించుకునేందుకు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించేందుకు తగిన అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ....... ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు నోటీసులు జారీ చేసినప్పుడు, సంబంధిత ఓటర్లు ప్రభుత్వం జారీ చేసిన, ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల అధికారిక ధ్రువపత్రాల్లో తమకు వర్తించే ఆధారాలను బీఎల్‌వోలకు సమర్పించాలని సూచించారు.

ఓటర్లు సమర్పించిన ధ్రువపత్రాలను అధికారులు నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. ఆధారాలు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారణ అయిన అనంతరం సంబంధిత వివరాలను భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, అర్హులైన వారి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఓటర్ల నుంచి ధ్రువపత్రాలు స్వీకరించిన అనంతరం వాటి పరిశీలన, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, తదుపరి ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

తెలకపల్లి మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో 2002 నాటి ఓటరు జాబితా ఆధారంగా ఇప్పటికే గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు సంబంధించి జనరేట్ చేసిన దరఖాస్తులు, నోటీసులు సంబంధిత ఓటర్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు.

ఎవరైనా ఓటరు అందుబాటులో లేకపోతే, వారికి సమాచారం చేరేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయిందా లేదా, ఓటర్లు తమ ఆధారాలను సమర్పించారా లేదా, సమర్పించిన ధ్రువపత్రాలను పరిశీలించారా లేదా అనే అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని తెలిపారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలోని ప్రతి పేరును నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నప్పటికీ, అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

అదే సమయంలో అర్హత లేని లేదా అనుమానాస్పదంగా ఉన్న నమోదులను నిబంధనల ప్రకారం పరిశీలించి, సంబంధిత ఓటర్లకు తమ వివరణ, ఆధారాలు సమర్పించుకునే అవకాశం కల్పించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ఓటర్లు సమర్పించిన ధ్రువపత్రాలను సంబంధిత అధికారులు ఆలస్యం చేయకుండా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశీలన పూర్తయిన వెంటనే అర్హత కలిగిన ఓటర్ల వివరాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. బీఎల్‌వోలు, బి ఎల్ ఏ లు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రక్రియను నిర్దేశిత సమయంలో పూర్తి చెయ్యాలని కలెక్టర్ తెలిపారు.

ఓటరు జాబితా సవరణకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను అక్కడికక్కడే గుర్తించి పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని, నోటీసులు అందుకున్న వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తమకు సంబంధించిన ఆధారాలను సమర్పించి ప్రక్రియలో సహకరించేలా వారికి వివరించాలని సూచించారు.

ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమైనదని, జాబితా సవరణలో ఖచ్చితత్వం, పారదర్శకత, నిబంధనల అమలుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు.

తెలకపల్లి మండల పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో 2002 ఓటర్ జాబితా ప్రకారం మ్యాపింగ్ కానీ వారు 582 మంది, అనాలిసిస్ జాబితా ప్రకారం 6974 మందిని గుర్తించడం జరిగిందని 7566 మందికి నోటీసులు జనరేట్ చేసి వారందరికీ నోటీసులను అందజేస్తున్నట్లు తాహసిల్దార్ కలెక్టర్ కు తెలిపారు.

జిల్లా కలెక్టర్ వెంట తెలకపల్లి తహసీల్దార్ విజయ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్, సంబంధిత పోలింగ్ కేంద్రాల బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు ఉన్నారు.

# రైతుల చిరకాల కోరిక నెరవేర్పు

**మంత్రి జూపల్లి సహకారంతో రూ.3.40 కోట్లతో బీటీ రోడ్డు**

**వెన్నచర్ల నుంచి గన్యాగుల వరకు బీటీ రోడ్డును ప్రారంభించిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్**



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలం, వెన్నచర్ల గ్రామం నుండి గన్యాగుల గ్రామం వరకు బీటీ రోడ్డును మాజీ ఎంపీపీ శ్రీ సూర్య ప్రతాప్ గౌడ్ టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ రహదారి గుంతలు చెట్లు ఉండటంతో రైతులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ రైతుల విజ్ఞప్తి మేరకు మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ ఈ సమస్యను తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ఈ బీటీ రహదారికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.3 కోట్ల 40 లక్షల నిధులు మంజూరు కావడం జరిగింది. పంచాయతీరాజ్ ఏఈ రాజశేఖర్ రెడ్డి, కాంట్రాక్టర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి.సత్యం, గ్రామ ఉపసర్పంచ్ బై రాముడు, వార్డు సభ్యులు వంగూరి స్వామి, ఒర్సు నాగమ్మ, చిన్న సుల్తాన్, మద్దని పద్మ, అగరయ్య, వి.చెన్నమ్మ, రామకృష్ణ, డి.మంజుల, దేవరాజ్, వి.బాలింగాచారి, జంగం పెద్ద నాగరాజు, ముచ్చిపోతు శంకర్, డి.ప్రభాకర్ తదితర నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పచ్చదనంతో మానసిక ప్రశాంతత

**ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు**

**ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటిన వైద్యులు, సిబ్బంది**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** పచ్చదనంతో మానసిక ప్రశాంతత లభించడంతో పాటు స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వైద్యులు, వైద్య సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డా. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మొక్కలు కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తాయని తెలిపారు. మొక్కల పెంపకంతో దుమ్ము, కాలుష్యం తగ్గడంతో పాటు ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణం కల్పించవచ్చన్నారు. రోగులకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించడమే లక్ష్యంగా ఆసుపత్రి ఆవరణలో పచ్చదనాన్ని పెంచుతున్నామని పేర్కొన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన కోరారు. నాటిన మొక్కలను సిబ్బంది తమ బాధ్యతగా భావించి క్రమం తప్పకుండా సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. సదాఫ్ ఫాతిమా, డా. లావణ్య, డా. జైనబ్ సుల్తానా, నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మల ఆనంద్, హెడ్ నర్స్ సోలి, సిబ్బంది సాయి తేజ, సత్యనారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బి.సి. మహిళలకు ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్' పథకం

**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** బి. సి .మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, వారి ఆర్థిక సాధికారతను పెంపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్' పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విష్ణు నందన్ తెలిపారు.

ఈ పథకం ద్వారా అర్హులైన బీసీ మహిళలకు కుట్టు మిషన్లు అందించి, ఇంటి వద్దనే కుట్టుపని చేసుకుంటూ స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆయన పేర్కొన్నారు. పథకానికి అర్హత కలిగిన బీసీ మహిళల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు.



ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు ప్రక్రియ సెప్టెంబర్ 13 వరకు కొనసాగుతుందని, అర్హులైన బీసీ మహిళలు నిర్దేశిత గడువులోగా తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తులను్ ట్రశీఎఎం.ఎన్లన్ర.ట్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు సమయంలో అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేసి, నిర్దేశిత గడువులోగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

అర్హులైన బీసీ మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందడంతో పాటు కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని విష్ణు నందన్ కోరారు. పథకానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

## పిల్ల బుచ్చయ్యకు ఘన సన్మానం



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపాలిటీ సీనియర్ నాయకులు లింగోజిగూడెం మాజీ ఉపసర్పంచ్ పిల్ల బుచ్చయ్య ను ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిన సందర్భంగా వారిని శుక్రవారం చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పనా యాదవ్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లింగోజిగూడెం గ్రామానికి ప్రజలకు సేవలు చేసిన సందర్భంగా పార్టీ గుర్తించి వారికి ఈ బాధ్యతను కేటాయించినట్లు తెలిపారు. అనంతరం జిల్లా కమిటీ మాజీ ఉపాధ్యక్షులు సీనియర్ నాయకులు రమణగౌని శంకరయ్య మాట్లాడుతూ.. ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించబడిన పిల్ల బుచ్చయ్య పార్టీకి, ప్రజలకు మరిన్ని సేవలు చేయాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెండవ వార్డ్ కౌన్సిలర్ పోలపల్లి లక్ష్మీ ముత్తయ్య, బూత్ అధ్యక్షులు బాతురాజు ప్రవీణ్, సీనియర్ నాయకులు పర్నే అంజిరెడ్డి, రమణ గోని నరసింహ, తూర్పునూరి నరసింహ, ఊదరి రంగయ్య, ఎర్రగోని మల్లేశం, పోలపల్లి భాస్కర్, ఎర్ర నరసింహ, పిల్ల యాదయ్య,పిల్ల శ్రీకాంత్,పిల్ల సురేష్, పిల్ల శ్రీధర్,పిల్ల రవిచంద్ర, శ్రీశైలం, గుండపల్లి వెంకటరెడ్డి,రమేష్,శివశంకర్, రమేష్ లు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులను మరింత వేగం చేస్తూ 2వ, 12వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. నగరపాలక సంస్థ 2వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీ సీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అనంతరం. 12వ డివిజన్ విఘ్నేశ్వర కాలనీలో అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల అభివృద్ధితో కాలనీవాసులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మేయర్ పేర్కొన్నారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ప్రణాళికాబద్ధంగా కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై.సునీల్ రావు, 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, మున్సిపల్ అధికారులు, డివిజన్ ప్రజలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి

### రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలి

### బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం డిమాండ్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 22ఏ (నిషేధిత భూములు) జాబితా అక్రమాలు, అవకతవకలపై, వేలాది మంది రైతులు, భూ యజమానుల ఆస్తి హక్కులను కాలరాస్తున్న ఈ భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకొని, ఈ తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో బిజెపి శ్రేణులతో కలిసి ఉన్నత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ 22ఏ నిషేధిత భూముల జాబితాలో జరిగిన భారీ అవకతవకలను కేవలం పరిపాలనా తప్పిదంగా కాకుండా, ఒక వ్యవస్థీకృత కుట్రగా పరిగణించి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వేలాది మంది భూ యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఈ భారీ కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి కుటుంబ కంపెనీకి, ఫీనిక్స్ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి వేల కోట్ల విలువైన ప్రాపర్టీస్ బదిలీ అయిన ఉదంతంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టాలని తెలిపారు. ధరణి/భూభారతి పోర్టల్స్‌లో గత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు జరిగిన మార్పులు, చేర్పులపై డిజిటల్ ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలన్నారు. కరీంనగర్ జిల్లాలోని 22ఏ భూముల వివరాలను మండలం, గ్రామం, సర్వే నంబర్ల వారీగా బహిర్గతం చేసి పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. తప్పుగా నిషేధిత జాబితాలో చేరిన ప్రైవేటు, పట్టా భూములను వెంటనే తొలగించి, బాధితులకు న్యాయం చేయడానికి ప్రత్యేక గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మెకానిజం ఏర్పాటు చేయాలన్నారు రికార్డులను ఉద్దేశపూర్వకంగా మార్చిన అధికారులు, మధ్యవర్తుల పాత్రపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ద్వారా బీజేపీ లేవనెత్తిన డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని , సమస్య పరిష్కారం కోసం వెంటనే చర్యలు చేపట్టకపోతే రైతుల తరఫున పోరాటం ఉధృతం చేస్తామని సాయిని మల్లేశం ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోలగాని శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, రంగు భాస్కరాచారి, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, బి.జె.వై.ఎం జిల్లా అధ్యక్షులు సంఘ నరేష్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు మోతే గంగారెడ్డి, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, నాంపల్లి శ్రీనివాస్, అడిచర్ల రాజు, ముత్యాల జగన్ రెడ్డి, గుంజేటి శివ, జగదీశ్వరాచారి, వాసు, సుధాకర్ పటేల్, కార్పొరేటర్ కె. పి.చంద్ర, ఎన్నం ప్రకాష్ , మండల, జోన్ అధ్యక్షులు పాదం శివరాజ్, అవదుర్తి శ్రీనివాస్, కుంట తిరుపతి, రాజిరెడ్డి, చింతం శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా

# వెంటనే రాజీనామా చేయాలి

### రామన్నపేట కోర్టు వద్ద న్యాయవాదుల నిరసన

### ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా అనుసరిస్తున్న ఏకపక్ష, అప్రజాస్వామిక, రాజకీయ పక్షపాత వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయన వెంటనే బీసీఐ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు.

రామన్నపేట కోర్టు ఆవరణలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ--- మనన్ కుమార్ మిశ్రా పద్నాలుగు సంవత్సరాలకు పైగా బీసీఐ చైర్మన్‌గా కొనసాగుతూ, చట్టబద్ధమైన ప్రజాస్వామిక సంస్థలో అధికారాన్ని వ్యక్తిగతంగా కేంద్రీకరించడం అభ్యంతరకరమన్నారు. బీసీఐ ఏ రాజకీయ పార్టీకి లేదా ప్రభుత్వానికి అనుబంధ సంస్థ కాదని, దేశంలోని న్యాయవాదులందరికీ ప్రాతినిధ్యం వహించాల్సిన స్వతంత్ర చట్టబద్ధ సంస్థ అని పేర్కొన్నారు. బీసీఐ అధికారిక పదవిని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించడం సంస్థ స్వతంత్రతను, విశ్వసనీయతను దెబ్బతీస్తుందని విమర్శించారు. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 2026 బ్యాచ్ పట్టభద్రులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేయడం ఏకపక్షమైన, చట్టవిరుద్ధమైన చర్యగా పేర్కొన్నారు. కొంతమంది విద్యార్థులు శాంతియుతంగా అభిప్రాయం వ్యక్తం చేసినందుకు మొత్తం బ్యాచ్‌ను శిక్షించడం రాజ్యాంగ విలువలకు, న్యాయవాదుల చట్టం--1961కు విరుద్ధమన్నారు. ఆదేశాలను అనంతరం ఉపసంహరించుకున్నప్పటికీ, విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన బాధ్యత నుంచి చైర్మన్ తప్పించుకోలేరన్నారు. ప్రజాస్వామికంగా ఎన్నికైన రాష్ట్ర బార్ కౌన్సిళ్ల స్వతంత్రతలో జోక్యం చేసుకోవడం, ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తులను నామినేషన్ల ద్వారా అధికార స్థానాల్లోకి తీసుకురావడానికి ప్రయత్నించడం ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధమన్నారు. న్యాయవిద్య ప్రమాణాలు, న్యాయ కళాశాలల తనిఖీలు, అనుమతులకు సంబంధించి వస్తున్న ఆరోపణలపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీసీఐ కోల్పోయిన గౌరవం, విశ్వసనీయత, ప్రజాస్వామిక స్వభావాన్ని పునరుద్ధరించేందుకు మనన్ కుమార్ మిశ్రా వెంటనే చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు పాల్వంచ జగతయ్య, జిల్లా కమిటీ సభ్యులు యాదాసు యాదయ్య, గడ్డం నరసింహ, వీరమల్ల నర్సింహ, అంతటి రమేష్, అంకం నరేష్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# జ్వరంతో వచ్చిన వారికి మలేరియా, డెంగ్యూ పరీక్షలు

# తప్పనిసరిగా నిర్వహించాలి

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

## పట్టణంలో నిరుపయోగంగా ఉన్న పార్కులను గుర్తించి అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి అక్షిత ప్రతినిధి:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలో కలెక్టర్ పర్యటించి ఆరోగ్య సిబ్బంది ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. కాలనీలో పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పరిసరాలను పరిశు భ్రంగా ఉంచేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జ్వరం వంటి లక్షణాలు ఎవరికైనా ఉన్నట్లు గుర్తిస్తే వారికి మలేరియా, డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. దోమల వృద్ధికి అవకాశం లేకుండా నిల్వ నీటిని తొలగించడం, పారిశుద్ధ్య చర్యలను నిరంతరం చేపట్టాలని సూచించారు. జలుపతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం రామ్‌నగర్ కాలనీలోని మున్సిపల్ పార్కును కలెక్టర్ పరిశీలించారు. పార్కు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. పార్క్ లో అవసరమైన మరమ్మతులు, అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఫైల్ పెట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, పట్టణంలో నిరుపయోగంగా ఉండి అభివృద్ధి నోచుకోని పార్కులను గుర్తించి నివేదిక సమర్పించాలని కమిషనర్ కు ఆదేశించారు. తద్వారా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కులను అభివృద్ధి చేయాలని సూచించారు.



### కేడీఆర్ బస్తీ దవఖాన పరిశీలన

అనంతరం కేడీఆర్ నగర్‌లోని బస్తీ దవాఖానాను కలెక్టర్ సందర్శించి ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా పాము కాటు, కుక్క కాటు బాధితులకు అవసరమైన మందులు, వ్యాక్సిన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. జ్వరంతో వచ్చే ప్రతి రోగికి అవసరాన్ని బట్టి మలేరియా, డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. బస్తీ దవాఖానాలో మందుల నిల్వలు, వైద్య సేవలు, రోగుల వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, స్థానిక కౌన్సిలర్ పరుశురాం, ఇతర ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యను ఖండించిన టీపిటీఎఫ్

## నిందితులను కఠినంగా శిక్షించాలి.. టీపిటీఎఫ్ డిమాండ్

## అంబేద్కర్ కూడలిలో రూపారెడ్డికి ఘన నివాళులు..




**తాండూరు, అక్షిత ప్రతినిధి:** నల్గొండ జిల్లాలో ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్యను ఖండిస్తూ, తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం (టీపిటీఎఫ్) వికారాబాద్ జిల్లా, తాండూరు శాఖ ఆధ్వర్యంలో శు క్రవారం తాండూర్ అంబేద్కర్ కూడలిలో సంతాప సభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అఖీల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రూపారెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా టీపిటీఎఫ్ నాయకులు, ఉపా ధ్యాయులు మాట్లాడుతూ.. రూపారెడ్డి హత్య అత్యంత బాధాకరమైన ఘటన అని పేర్కొన్నారు. ఘటనకు బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, విద్యాసంస్థల సిబ్బందికి ప్రభుత్వం పూర్తి భద్రత కల్పించాలని, కోరారు. విద్యార్థుల్లో డ్రగ్స్, గంజాయి, మొబైల్ ఫోన్ల దుర్వినియోగం, సోషల్ మీడియా దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించేందుకు తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేయాలని, సూచించారు.

ఈ కార్యక్రమంలో టీపిటీఎఫ్ జిల్లా బీసీ సంఘం నాయకులు కందుకూరి రాజ్‌కుమార్, టీజేఎస్ రాష్ట్ర నాయకులు సోమశంకర్, విద్యావంతుల వేదిక నాయకులు పరియాద రామకృష్ణ, ట్రస్మా తాండూరు టౌన్ అధ్యక్షులు మోహన్ కృష్ణ గౌడ్, సెక్రటరీ వెంకటేష్, సీపీఐ జిల్లా నాయకులు శ్రీనివాస్, పిడీఎస్యూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ఏ.ఆర్. లాజిక్స్ అశోక్, స్వరోజ్, నాయకులు శివ కుమార్, విద్యాసంస్థల యజమాని కీర్తి శర్మ తదితరులు పాల్గొన్నారు.

టీపిటీఎఫ్ ఉపాధ్యాయులు మహమ్మద్ ముదస్సిర్, ఖైయుం, ఖదీర్, శ్రీనివాస్, అమరిత, రజని, తన్వీర్, అనిత, కవిత, వినోద్, సతీష్, యూనుస్, శివ, మెహెరాజ్, రాజేశ్వరి, తులసి, అమీనా తదితరులు పాల్గొని, నివా ళులర్పించారు. బీసీ సంఘం నాయకులు సయ్యద్ షుకూర్, గడ్డం వెంకటేష్, జోసఫ్, పరమేశ్, షబ్బీర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

రూపారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి న్యాయం చేయాలని, ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులకు కఠిన శిక్ష విధించాలని, టీపిటీఎఫ్ వికారాబాద్ జిల్లా, తాండూర్ నాయకులు డిమాండ్ చేశారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో మృతుల కుటుంబాలకి ఆర్థిక సహాయం



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మున్సిపాలిటీలో హనుమాన్ నగర్ కాలనీకి చెందిన కారగండ్ల సుమతమ్మ ఆరోగ్యంతో మరణించడం జరిగింది అలాగే కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామంలో గోరటి ఇధమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా అలాగే ఉప్పల టీమ్ సభ్యుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాచోడి శ్రీశైలం ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు దాచేపల్లి శ్రీనివాసులు ఉప్పల సైన్యం దారమోని గణేష్, అనిల్ దాద మొని వార్డు సభ్యులు మద్దెల వెంకటయ్య, సెట్టిపల్లి లోకేశ్వర్, ఆరేకంటి పరమేశ్వర్, ఎముకంటి వెంకటయ్య ,పబ్బతి రామస్వామి, సైధులు, అశోక్ ,సురేష్ ఎనమల్ల ,కూన వెంకటయ్య ,రామకృష్ణ, శరత్ ఐళ్ల శేఖర్ గౌడ్ రాజు యాకూబ్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## నేడు మానసిక వికలాంగుల పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

### ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో ఎల్.ఎం.డి కాలనీలో మహాత్మా నగర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించబడుతున్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో శనివారం ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని చుట్టుపక్కల ప్రజలంతా ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలిపారు. ట్రస్ట్ పాఠశాలలో వెంకటరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మానసిక వికలాంగుల పాఠశాల ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, గత సంవత్సరం కూడా ఎల్.వి.ప్రసాద్ ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించామని, గత నెలలో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించామని, శనివారం తిరిగి ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వారు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించడానికి ముందుకు వచ్చారని ఈ శిబిరాన్ని చుట్టుపక్కల ప్రజలే కాకుండా విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ ఉచిత వైద్య శిబిరం కార్యక్రమానికి ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేస్తున్న వేముల శ్రీనివాస్, జిల్లా కలెక్టర్, నిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్, జిల్లా సంక్షేమ అధికారితో పాటు ఇతర అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని వెంకటరెడ్డి తెలిపారు.

## కోట మైసమ్మ అమ్మవారి పూజలకు సర్వం సిద్ధం

### సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ బుడ్డయ్య



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** లింగాల పట్టణ కేంద్రంలో 23 ఆదివారం న శ్రీ కోట మైసమ్మ పూజా కార్యక్రమం నిర్వహించనున్న సందర్భంగా. పట్టణ సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ బుడ్డయ్య యాదవ సోదరులతో ముఖాముఖి చర్చిస్తూ. పండుగ సంప్రదాయాలను పాటిస్తూ, ప్రతి ఏటా ఇచ్చే యటను భక్తితో సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అచ్చంపేట మార్కెట్ డైరెక్టర్ ముక్తార్, శంకర్ నాయక్, బుడ్డయ్య యాదవ్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు నీటి గుంతలను నిర్మించుకోవాలి

**ఎంపీడీవో నాగం.నరేష్**



**ఇచ్చోడ అక్షిత న్యూస్ :** బి.జి.రాం.జీ పథకంలో భాగంగ రైతన్నలు వారి వారి పంట పొలాల్లో నీటి గుంతలను నిర్మించుకోవాలని స్తానిక ఎంపీడీవో నాగం నరేష్ పేర్కొన్నారు. అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని బోరిగామ గ్రామంలో .బి.జి.రాం.జీ పథకం ద్వారా చేపట్టిన ఫారం పాండ్ ( నీటిగుంత ) పనిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్నీవో ప్రభావం వలన వర్షాలు అనుకున్నంత స్థాయిలో కురవడం లేదని అన్నారు. ప్రతి రైతు తమతమ వ్యవసాయ భుముల లో పంట కుంటలను నిర్మాణం కోసం వి.బి.జి.రాం.జీ పథకం లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పడిని కొద్ది వర్షాన్ని పంట కుంటల ద్వారా నిల్వ చేసు కోవచ్చునని చెప్పారు. దీనిపై రైతులకు గ్రామాల వారీగా అవగాహన కల్పిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మల సుప్రియ, ఏపీవో నరేందర్ గౌడ్, క్షేత్రస్థాయి అధికారి సుధాకర్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలను సందర్శించిన శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్



**మానకొండూర్ అక్షిత న్యూస్:** తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ గ్రామపంచాయతీ పరిధిలో కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలను శుక్రవారం శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ సందర్శించారు. ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ని కలిసి పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సంరక్షణ, విద్యా బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వి.సి. ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ మానసిక వికలాంగుల పాఠశాలలను నడపడం అంటే ఓపికతో కూడుకున్న పని అని, మారుతున్న కాలంలో మానసిక వైకల్యం ఉన్న పిల్లలను సంరక్షించడంలో తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అలాంటి వారిని చదివించడం కోసం వారికి ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ లాంటివి నిర్వహించడం, వృత్తి విద్య నైపుణ్యాన్ని పెంపొందించడం హర్షించదగ్గ విషయమన్నారు. పాఠశాల అధ్యాపకుల,ఆయాల ధైర్యాన్ని ఓపిక తత్వాన్ని అభినందించడంలో ఏమాత్రం సందేశించాల్సిన అవసరం లేదని పాఠశాల నిర్వహణ కోసం ట్రస్ట్ చైర్మన్ వెంకట రెడ్డి, సభ్యుల కృషి అభినందనీయమని వి.సి ఉమేష్ కుమార్ కొనియాడారు.మొదటిసారి పాఠశాలకు విచ్చేసిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ కు పాఠశాల తరఫున చైర్మన్ వెంకటరెడ్డి శాలువాతో సత్కరించి,జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, ప్రిన్సిపల్ సతీష్, అడ్మినిస్ట్రేటర్ బాల్ రాజ్, సింగిల్ విండో డైరెక్టర్ చాడ శ్రీధర్ రెడ్డి, పాఠశాల అధ్యాపకులు,సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెంట్లవెల్లి రెవెన్యూ ఆఫీసులో ఆకస్మిక తనిఖీ

# ఫైళ్ల పెండింగ్‌పై ఆగ్రహం

**మంత్రి జూపల్లి కృష్ణారావు**



**కొల్లాపూర్ అక్షిత న్యూస్ :**

కొల్లాపూర్ నియోజక వర్గం పెంట్లవెల్లి మండల రెవెన్యూ కార్యాలయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని రెవెన్యూ వినతులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో ఫైళ్లు అపరిష్కృతంగా ఉండడం పట్ల అధికారులను ప్రశ్నించారు. ప్రజల దరఖాస్తులను ఎందుకు పెండింగ్‌లో ఉంచారని నిలదీశారు. అనంతరం కార్యాలయంలో కలియతిరిగిన మంత్రి టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి ఆర్డీవోపై



తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయంలో కనీస పరిశుభ్రత లేకపోవడంపై మండిపడి తానే స్వయంగా నీళ్లు పోసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లోని ప్రభుత్వ రెవెన్యూ కార్యాలయాల్లో ఫైళ్ల క్లియరెన్స్ ప్రక్రియను నేను స్వయంగా పరిశీలిస్తాను అని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులపై ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకునేలా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రజల దరఖాస్తులు రాసేందుకు తన తరఫున నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు పోలీసు స్టేషన్లలో ప్రత్యేకంగా కుర్చీ, టేబుల్ వేయించి కాంగ్రెస్ నాయకులను కూర్చొబెడతామని తెలిపారు. ఎప్పటికప్పుడు వివరాలను తనకు పంపించాలని సూచించారు. మంత్రి వెంట పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థికి జాతీయస్థాయి రాకెట్బాల్ పోటీలకు అర్హత



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** విద్యార్థులు క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని మరియు వివిధ క్రీడల పోటీలలో పాల్గొని వారి యొక్క సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని తద్వారా వారికి ఉపాధి అవకాశాలు చాలా వస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ లో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థి జాతీయస్థాయి రాకెట్బాల్ పోటీలకు అర్హత సాధించడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందినటువంటి రాకెట్బాల్ పోటీలలో పాల్గొనడమే కాకుండా ప్రతిభను చాటాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించినటువంటి ఈ పోటీలలో అసమాన ప్రతిభను చాటి త్వరలో నిర్వహించబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం చాలా గొప్ప విషయమని చెప్పారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి పెడతామని మరియు వారికి అన్ని రకాలుగా వనరులు కల్పించి ప్రోత్సాహం అందించడంతో పాటు వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటటువంటి వివిధ రకాల పోటీలకు సైతం ప్రాతినిధ్యం వహించే విధంగా ప్రేరేపించడం జరుగుతుందని వారు చెప్పారు ఈ క్రీడ వేగవంతమైన ఇండోర్ క్రీడని, నాలుగు గోడలున్న కోర్టులో ఈ క్రీడను ఆడతారని ఈ క్రీడలో సర్వ్, రిటర్న్ షాట్, ప్లేస్మెంట్, ఫోటో వర్క్, ముఖ్యమైన నైపుణ్యాలని అమెరికాలో ఈ క్రీడకు చాలా ఆదరణ ఉన్నదని ఇతర దేశాలలో కూడా క్రమంగా ప్రాచుర్యం పొందుతుంది అని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో కరీంనగర్ జిల్లా శివారులో గల ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించినటువంటి అంతర్ జిల్లా స్థాయి పోటీలలో పాఠశాలకు చెందినటువంటి నాగ విగ్నేష్, 9వ తరగతి, అసమాన ప్రతిభను కనబరిచి త్వరలో తమిళనాడులో నిర్వహించబోయే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడని వారు చెప్పారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## 23 ఏళ్లుగా పూర్తికాని ధర్మారెడ్డిపల్లి కాలువను పూర్తి చేసి సాగునీరు అందించాలి

**గుంతలమయమైన ఆర్ఎంబీ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి**

**అర్హులైన పేదలందరికీ పింఛన్లు మంజూరు చేయాలి**

**కొమ్మయిగూడెం గ్రామ సమస్యలపై సిపిఎం నిరసన దీక్ష**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొమ్మాయిగూడెం సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి జల్లెల పెంటయ్య మాట్లాడుతూ, ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణం ప్రారంభమై 23 సంవత్సరాలు గడిచినా నేటికీ పూర్తికాకపోవడం దారుణమన్నారు. కాలువను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని భూములు పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలువ పూర్తయితే ఈ ప్రాంతంలోని అనేక మంది రైతులకు సాగునీటి సౌకర్యం కలుగుతుందని వెంటనే బడ్జెట్ కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. రామన్నపేట--కొమ్మాయిగూడెం మీదుగా పెద్దకాపర్తి వరకు ఆర్ఎంబీ రోడ్డు అనేక సంవత్సరాలుగా గుంతలమయంగా మారి కాళ్లు చేతులు విరిగి ప్రాణాలు పోయినా అధికారులు ప్రభుత్వం పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు అధ్వాన్న స్థితిగా ఉన్న రోడ్డును వెంటనే నూతనంగా ఏర్పాటు చేయాలని అన్నారు.గ్రామంలో అనేక మంది అర్హులైన పేదలు ఉన్నప్పటికీ సంవత్సరాలు దాటుతున్ననేటికీ పింఛన్లు అందడం లేదన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వశీ, పింఛన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన కొనసాగిస్తామని అన్నారు.

కొమ్మాయిగూడెం నుండి వెలిమినేడు. సిరిపురం గ్రామాలకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్ పార్టీ మండల నాయకులు కూరెళ్ళ నరసింహ చారి,కందుల హనుమంతు, కల్లూరు నాగేష్, బావండ్లపల్లి బాలరాజు,ఆవనగంటి నాగేష్, మేడి ముకుందం,మునుకుంట్ల లేనిన్,పల్లె సత్యం, దీక్షలో కూర్చున్న నాయకులు శాఖ కార్యదర్శి శానగొండ వెంకటేశ్వర్లు,ఎర్ర రవీందర్,ఎర్ర కాటమయ్య,అంతటి సత్తయ్య, అంతటి నరసింహ, శానగొండ రాము, సాగర్ల శేఖర్,గుణగంటి మల్లేష్, జల్లెల మల్లేశం,ఆకిటి మల్లేశం,ఆకిటి శ్రీను, కడప చరణ్,బాణాల నవీన్ రెడ్డి,గోలి ఉత్తేజ్,కొండగడప నవీన్, జల్లెల శివకుమార్, బోయపల్లి శంకర్, పొట్లచెరువు శంకరయ్య, మాజీ సర్పంచ్ జల్లెల లక్ష్మమ్మ,ఎర్ర సుమలత ఎర్ర అలివేలు, బాత్క ఐలమ్మ,బాత్క మారయ్య తదితరులు పాల్గొన్నారు.